"దేవుడిచ్చిన దానిని వద్దంటామా!" నవ్వొచ్చింది. అలాకాదు అనాలిసింది. "దేవుడిచ్చిన దానిని వద్దనగలమా!" అనాలి అనుకున్నాడు పేలవంగా నవ్వుకుని.

అతనిలో ఏదో బాధ కలిగింది. అంతా విధి విధానము. ఎవళ్ళు మాత్రం ఏమిచేయగలరు?"

"నిష్కారణంగా శశికి బాధ కలిగించాను. ఎన్నడూ యిలా మాట్లాడలేదు. ఏమనుకుందో! ఎంత బాధపడిందో!" మథనపడి పోయాడు. పూల మార్కెట్టుకు వెళ్ళి మల్లెపువ్వులు ఒక పొట్లం కట్టించుకున్నాడు అదే ధ్యాసలో.

* * *

"ఏమిటండీ అది?" "చెప్పుకోవాలి మరి."

"నీ ముఖం" నవ్వాడు భాస్కరం.

ఆరేళ్ళ జీవితంలోనూ ఎన్నడూ మార్కెట్ నుంచి పూలు తీసుకురాని భాస్కరం యివాళ... ఆశ్చర్యపడింది శశి.

"త్వరగా అలంకరించుకో, సినిమాకు వెళ్ళాలి. విస్తీర్ణము తక్కువయితే గదూ వేగిరం తెమలడానికి" ఫక్కుమని నవ్వాడు భాస్కరం.

ఆపుకోలేక నవ్వేసింది శశికూడా.

ఉదయం తొమ్మిదింటిదాకా తనమీద చిటమటలాడిన భాస్కరం సాయంత్రం నాలుగింటికంతా ఇంతగా ఎలా మారిపోయాడు అని నిర్ఘాంత పోయింది శశి.

"ఏడు గంటల్లో ఎంతమార్పు!" అనుకుంది ఆమె హృదయం తృప్తిగా తేలికపడి.

ఉదయం చూపిన చిటమటకూ సాయంత్రం చిందిన చిరునవ్వుకూ అంతర్యం యేమిటో శశికి ఈనాటికీ తెలియదు.

---

స్కెచ్

# చతురత్యాగం

"బనఫూల్"

ఆమె అందాన్ని వర్ణించట మనవసరం. అసలు ఈ రోజుల్లో అందాన్ని వర్ణించ కూడదు. కాని—

ఆమె చాలా అందంగా ఉంటుంది. ఆమె ఆస్పత్రిలో నర్స్. ఆమెనూ ఆమె అందాన్నీ చూచి సేనాపతి చిత్తయిపోయాడు. అతని భావాలామె గ్రహించిందో ఏమిటో, ఏదో మిష మీద తరుచు సేనాపతి దగ్గరకు వస్తుండేది, యుద్ధంలో సేనాపతికి గాయం తగిలింది. ఆస్పత్రిలో పడేశారు. కొన్నాళ్ళకు ఆ గాయం నయమైపోయింది. మరుచటినాడు ఆస్పత్రినుండి విడుదలవుతుందతనికి. ఆ గాయం నయమైనా, ఈ చిన్నారుండే—అబ్బబ్బా! మరో గాయానికిమల్లే అతని హృదయంలో చిటుకూ పటుకూమంటూ అతన్ని మరీ బాధపర్చ సాగింది. ఆమెను చూచి నప్పుడల్లా సేనాపతికి మతిభ్రమించినట్లుగావుండేది.

మరి రెండురోజుల్లోగా సేనాపతి తన క్యాంపులో వుండాలి. కిటికీనుండి బయటికి చూడసాగాడు. అంతా చీకటి. అప్పుడే అతనికోసం భోజనం తీసుకొచ్చిందామె. ఆమెను తనివితీరా చూస్తూ— "నేను రేపే వెళ్ళిపోవాలి" అన్నాడు, ఏదో పోగొట్టుకున్న వాడికిమల్లే. 'అవున'న్నట్టు తల ఊపింది.

"నేను వెళ్ళిపోయాక, నేను జ్ఞాపకానికి వస్తే నీకు చాలా బాధగా ఉంటుంది కదూ!" అన్నాడు సేనాపతి.

"ఆ విషయం నాకన్నా మీకే బాగా తెలుసు" అందామె.

"నాతో వస్తావా?"

"ఎక్కడికి?"

"నా క్యాంప్‌కి."

"ఎందుకు?"

"ఎందుకా? నీకు తెలీదూ? పోనీ ఒక్కరాత్రి కోసం."

"ఉద్యోగం వదిలి ఎలా రాను!"

"సెలవు తీసుకో."

"మీ శిబిరానికి నేను ఏ మిషతో రావాలి?"

"మగాడి వేషంలో వస్తే ఏ చిక్కూవుండదు."

"అవుననుకోండి. కాని సెలవు ఎలా దొరుకుతుంది?"

"అదంతా నేనుచూసుకుంటాను."

* * *

రెండు రోజుల తరవాత—

సేనాపతి శిబిరానికి మగాడి వేషంలో వచ్చింది నర్సు. కూర్చుంది. రెండుక్షణాల నిశ్శబ్దం. ఎవరూ మాట్లాడలేదు. ఒకరొకరొనహరు తనివితీరా చూసుకొంటున్నారు. ఇద్దరి కళ్ళల్లోనూ, హృదయాల్లోనూ మత్తెక్కుతుందేమో! బయట చీకటి. ఘోరమైన చీకటి. ఆఖరికి సేనాపతి అన్నాడు కదా—

"ఆ గదిలోకి పోదాంపద." ఆమె లేవలేదు.

"లేవవేం? అసలు నీకొకావల్సిందేమిటి?"

"ఏం? మీరిస్తారా?"

"తప్పకుండా ఇస్తాను. ఏంకావాలో కోరుకో."

"ఏమీలేదు. మీరు యుద్ధాలు ఎలా గెలుస్తున్నారో, అది తెల్సుకోవాల నుంది నాకు."

"ఒక్క ముక్కలో చెప్పాల్సిన విషయం కాదిది."

"త్వరలోనే మీరు మళ్ళీ శత్రువుల నెదురుకుంటారని విన్నాను. ఏమిటి మీ ఎత్తు?"

"ఎత్తు! అయితే నీకు యుద్ధంతాలూకా 'ప్లాన్' తెల్సుకోవాల నుందన్నమాట!"

"అవును" ఈ గూఢచారిణి వింతగావుందే అనుకున్నాడు సేనాపతి.

"యుద్ధం ప్లాన్ తెల్సుకుని నువ్వేం చేస్తావ్?"

"ఏమీలేదు. కేవలం కుతూహలం."

"ప్లాన్ నేనెవరితోనూ చెప్పను. అలా చెప్పకూడదు. అది ప్రభుత్వాజ్ఞ."

"పరపురుషుని పడక గదిలోక్కూడా వెళ్ళకూడదని శాస్త్రాజ్ఞ."

"నేను ప్లాన్ చెప్పందే ఆ గదిలోకి రావా?"

"ఊహూ! అందామె; కోటు విప్పి వంకెనకు తగిలిస్తూ.

"నేను బల ప్రయోగం చేస్తే!"

"కేకలు వేస్తాను. మీబోటి సేనాపతికది అవమానకరం."

"సరే చూడు," అంటూ ప్లాన్ చూపించాడు. ఆమె చూచింది.

"ఇక పద."

"మీరు ముందువెళ్ళండి, నేనుకాస్త 'బాత్ రూమ్'కి వెళ్ళివస్తాను. అన్నట్టు ఆగది ఎక్కడ?"

బాత్ రూమ్ చూపించి సేనాపతి తన శయనాగారంలోకి ప్రవేశించాడు. అతను వెళ్ళగానే నర్సు టేబిల్ మీద కాగితం తీసి ఏదో రాసింది. రాయటము పూర్తికాగానే బాత్ రూమ్‌కి వెళ్ళింది. తరవాత సేనాపతి శయనాగారంలోకి వెళ్ళింది.

* * *

ఆ తెల్లారకట్ల—

సేనాపతి శయనాగారం నుండి బయటికి వచ్చాడు. ఆమె కూడా బయటికి వచ్చింది. సేనాపతి హృదయం పాషాణంకన్నా కఠోరతరమైంది. నవ్వుతూ ఆమె ఏదో చెప్పబోయింది. కాని...అదే క్షణంలో సేనాపతి పిస్తోలు గర్జించింది. ఆమె చచ్చిపోయింది. అకస్మాత్తుగా టేబిలుమీద ఉన్న కాగితాన్ని చూశాడు—చదివాడు—

"సేనాపతిగారికి:

నేను పట్టుపడ్డాను. నా అదృష్టంకొద్దీ నా చావు మీ చేతుల్లో రాసిపెట్టాడు దేవుడు. కాని—ఒక ప్రార్థన. శత్రుపక్షానికి చెందిన సేనాపతిని ప్రార్థించకపోదును. కాని—మిమ్మల్ని నేను నిజంగా హృదయపూర్వకంగా ప్రేమించాను. అందుకే ప్రార్థిస్తున్నా, నా శవాన్ని మాదేశానికి పంపించెయ్యండి. ఇదే నా ఆఖరు కోరిక.

మీ—క్షణసంగిని."

* * *

ఆమె కళేబరం ఆమె స్వదేశానికి పంపబడింది. కాని—అంతకుముందే మరో వార్తకూడా పంపబడింది. ఆమె బ్రతికున్నప్పుడు ఆమె స్వయంగానే ఈవార్త పంపించింది. "నా శవాన్ని తనిఖీచేస్తే ఒక రహస్యం బయటపడుతుంది." బాత్ రూమ్‌లో ఆమె ఓ కాగితాన్ని మింగింది. పోస్టు మార్టమ్ చేశాక అది బయటపడింది. అందులో ఉన్నది యుద్ధం ప్లాన్ తాలూకు నకలు.

(అనుసరణ: శశిభూషణ్ పాత్రో)